క్లుప్తంగా

శివలింగంపై సూర్య కిరణాలు



రొంపిచెర్ల: రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివలింగంపై శనివారం ఉదయం సూర్య కిరణాలు ప్రసరించాయి. మహా శివరాత్రి సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో శివలింగంపై సూర్య కిరణాలు ప్రసరిస్తాయని ఆలయ పూజరులు తెలిపారు. ఆ సమయంలో చూస్తే భక్తులు కోర్కెలు నెరవేరుతాయని పేర్కొన్నారు. భక్తులు సూర్యకిరణాలను చూసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు ముని రాజశర్మ శాస్త్రోక్తంగా పూజార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సదుం: గర్భవతులు రక్తహీనత సమస్య బారిన పడకుండా క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీష అన్నారు. పీఎం మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం ఆసుపత్రిలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి డాక్టర్ మాట్లాడారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, నెలలు నిండాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవాలని కోరారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేసుకుంటే నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు అవగాహన కల్పించారు.

నగిరేపల్లెలో ఫ్యామిలీ డాక్టర్



పెద్దపంజాణి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు ఓ వరమని రాయలపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మౌనిక చెప్పారు. మండలంలోని నగిరేపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 68 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శిరీష, ఏఎస్ఎం రాజేశ్వరి, 104 సిబ్బంది పవన్, ప్రవీణ్, హెల్త్ అసిస్టెంట్ రవి, ఆశావర్కర్ కమలమ్మ పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో రోగులకు చేస్తున్న వైద్య పరీక్షలు

సదుం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం లయన్స్‌క్లబ్, వైదేహీ ఆసుపత్రి(బెంగళూరు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గుండె వైద్య నిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్‌రెడ్డి బృందం ఆధ్వర్యంలో 93 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, 26 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేసినట్టు క్లబ్ ప్రతినిధులు రాజారెడ్డి, జయకుమార్‌రెడ్డి చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు.

ఇంధనం పొదుపులో భేష్



బహుమతులు పంపిణీ చేస్తున్న మేనేజర్

పుంగనూరు: పుంగనూరు డిపో బస్సులలో ఇంధనం పొదుపు చేసిన ఆర్టీసీ డ్రైవర్లకు నగదు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. శనివారం డిపో మేనేజర్ సుధాకరయ్య, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి కలసి డ్రైవర్లు సలీం, నామశివయ్య , రెడ్డెప్ప, కండక్టర్ పార్వతమ్మకు రూ.500 చొప్పున అందజేశారు. డీఎం మాట్లాడుతూ, డిపోలో వీరు ఇంధన పొదుపులో ఆదర్శంగా నిలిచారని, వీరిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ఇంధనం పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, ఆర్టీసి నాయకుడు కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె బాట గంగమ్మ జాతర శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేసి, రాత్రి అమ్మవారి శిరస్సును విశేషంగా అలంకరించి, గ్రామ వీధుల గుండా కోలాహలంగా ఊరేగించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పేదలకు అన్నదానం

పలమనేరు: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ సీఎస్ నవీన్‌కుమార్ పేదలకు శనివారం అన్నం ప్యాకెట్లను అందజేశారు. కొన్నాళ్లుగా ఆయన శ్రీవారి పేరిట ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కడుదాం



మహిళలతో మాట్లాడుతున్న దుర్గ



సారె అందుకున్న మహిళలతో దుర్గ

- ఇంటింటా దుర్గ ప్రచారం

రామకుప్పం: రానున్న ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని గౌరివిమాకులపల్లె, బందార్లపల్లె పంచాయతీలలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ, చీర సారెగా అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే, ఆయా పథకాల కింద లబ్ధి పొందారా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. తమకు ఎవరు సిఫారసులు లేకుండానే పథకాలు అందాయని, ఆ పథకాల ఫలాల మూలాన నిశ్చింతగా తమ కుటుంబాలు ఉన్నాయని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. దీనిపై దుర్గ స్పందిస్తూ, జగనన్న పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ఇళ్ల ముంగిటకే అందజేశారన్నారు. సామాజిక పింఛన్లు మొదలుకొని పథకాలు, రేషన్ కార్డులు ..మొదలైనవన్నీనూ ప్రజల దరికి చేర్చిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. ఇదే తెలుగుదేశం పాలనలో పథకాలేవీ అర్హులకు అందేవి కావని, కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా, పింఛన్ల కోసం అంగలార్చినా మంజూరు చేసిన పాపానపోలేదని విమర్శించారు. జన్మభూమి కమిటీల కనుసన్నల్లో అంతా సాగేదని, దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా ఆ కమిటీలు నిలిచాయన్నారు. జగనన్న సీఎం అయ్యాక ఈ దోపిడీ పర్వానికి పూర్తిగా చెక్ పెట్టి, పాలనా వ్యవస్థలో సంస్కరణలు, మార్పులు తీసుకువచ్చారన్నారు. అంతేకాకుండా 40 ఏళ్లలో చంద్రబాబునాయుడు చేయని అభివృద్ధి, అందివ్వని సంక్షేమాన్ని కేవలం నాలుగున్నరేళ్లలోనే కుప్పం నియోజకవర్గానికి జగనన్న చేశారని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ పర్యాయం ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని అభ్యర్థించారు. తన భర్త నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. జగనన్న చేసిన మేలుకు ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రతిఫలం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచులు రాజ్‌గోపాల్, వాణి, ఎంపీటీసీ సభ్యులు సౌమ్య, సుధారాణి, సుబ్బమ్మ, మాజీ ఎంపీపీ ఆరేళ్ల జయప్ప, నేతలు కుందనందన రెడ్డి, అశోక్, శోభన్, సురేంద్ర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధిక మెజారిటీతో గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని ఎంపీపీ యువరాజు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని యాలకల్లు, ముదరందొడ్డి, బోయచిన్నాగపల్లె, చింతమాకులపల్లె, ఎస్.బండపల్లె, ఓగు పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, గృహసారథులకు ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఎమ్మెల్యే వెంకటేగౌడ భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వ పాలనలో ప్రజలకు, రాష్ట్రానికి ఎంత మేలు జరిగిందో, చంద్రబాబు ఎన్ని కుట్రలు చేస్తున్నాడో ఈ బహిరంగ సభల్లో ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన నమ్మక ద్రోహాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, జగనన్న ఇచ్చిన హామీలకు కట్టుబడిన విషయాన్ని పూర్తి స్థాయిలో వివరిస్తారన్నారు. ఈ బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు గోపిరెడ్డి, శ్రీరాములురెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, మురళి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దామోదరం, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డైరీల ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్-2024 డైరీలు, క్యాలెండర్లను శనివారం ఆ అసోసియేషన్ నేతలతో కలసి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పి.కొత్తూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, గురువులే సమాజ మార్గ నిర్దేశకులని, మంచి సమాజాన్ని తీర్చిదిద్దడంతో క్రియాశీలకపాత్ర పోషించాలన్నారు. నేతలు సోమచంద్రారెడ్డి, కుమార్, టీకే షణ్ముగం, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం



పలమనేరు: కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఆఫీస్ సబార్డినేట్ వెంకటేష్ నియమితులయ్యారు. ఇక్కడ అటెండర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో ఉద్యోగ విరమణ చెందిన వరలక్ష్మి చెందారు. కారుణ్య నియామకం కింద వరలక్ష్మి కుమారుడు వెంకటేష్‌కు ఉద్యోగమిచ్చారు. నియామక పత్రాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ హయాంలో కారుణ్య నియామకాలు పొందాలంటే కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా కరుణించే వారు కాదని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో ఆయా నెలలో అందిన దరఖాస్తులను పరిశీలించి నెల వ్యవధిలోనే నియామకాలను పారదర్శకంగా ఇస్తున్నట్టు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

- డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న



కల్లుపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న

గంగవరం: పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్..ఇత్యాది సౌకర్యాల లేమి లేకుండా ఎన్నికల సమయానికి పూర్తయ్యేలా చూడాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ ఒక్కరోజే గంద్రాజుపల్లె, పసుపత్తూరు, గుండుగల్లు, తాళ్ళపల్లె, కల్లుపల్లె, కీలపల్లె, జీడిమాకులపల్లె, మామడుగు, మేలుమాయి, కలగటూరు.. ఇలా మొత్తం 31 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎన్నికల రోజున ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి సంబంధించి అన్ని సౌకర్యాలు ఉన్నాయా, లేదా? అని ప్రధానంగా పరిశీలించారు. కొన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులు చేస్తున్న నేపథ్యంలో అక్కడి పోలింగ్ కేంద్రాల్లో వసతులను పూర్తి స్థాయిలో కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరరావు, డీటీ సహానా, సర్వేయర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చౌడేపల్లె: మండలంలోని ఏ.కొత్తకోట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం సమ్మేళనం నిర్వహించారు. 2009-10లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలిశారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురుదేవులను సన్మానించారు. పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. వివిధ రంగాల్లో స్థిరపడిన తాము స్కూలు అభివృద్ధికి తమవంతు తోడ్పాటునిస్తామని ప్రకటించారు. అలాగే ప్రతి యేటా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విదార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని, పేద విద్యార్థులకు అవసరమైన సాయం చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ రిజ్వానా, ఎంపీటీసీ నాగరత్న, ఉపసర్పంచ్ వినోద్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు మహమ్మద్ షఫీ, చిన్నా, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వెలుగు అధికారులు, సభ్యులు

వి.కోట: ఓటు హక్కుపై ప్రజలు అవగాహన కలిగి దానిని సక్రమంగా వినియోగించుకున్నప్పుడే నిజమైన ఫలితాలను పొందవచ్చని వెలుగు సీసీ నాగరాజు అన్నారు. శనివారం మండల వెలుగు అధికారుల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై పట్టణంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఓటు ఒక వజ్రాయుధం లాంటిదని, ప్రజాస్వామ్యంలో ఓటుతోనే మంచి పాలకులను ఎన్నుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర గోపిక, ఈఓ లీడర్లు, వెలుగు సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలి

పలమనేరు: బీసీలకు అన్ని రంగాల్లో పదిశాతం రిజర్వేషన్లను కల్పించాలని ఢిల్లీలోని పలు పార్టీల ముఖ్యనేతలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నట్టు స్థానిక బీసీ సంఘ నేత, ఏపీ సంచార జాతుల నాయకులు పూసల రవి శనివారం తెలిపారు. ప్రస్తుతం కులగణన చేస్తున్న నేపథ్యంలో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత స్థానాన్ని కల్పించాలంటే ప్రత్యేకంగా రిజర్వేషన్లను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసులను కేంద్రం అమలు చేయాలని కోరినట్టు తెలిపారు.

ఆర్థికసాయం



కుప్పం రూరల్: కుప్పం మండలం దాసేగౌనూరు పంచాయతీలోని బొగ్గుపల్లె చెందిన చిన్నప్ప (67) శనివారం అనారోగ్యంతో మరణించాడు. ఇదితెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతునికి కుటుంబానికి స్థానిక నాయకులు మురుగేష్, నగేష్, మురళి ద్వారా రూ.10వేలను అందజేశారు.

108లో ప్రసవం



రామకుప్పం: ఓ గర్భిణిని ఆస్పత్రికి 108 అంబులెన్సులో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ప్రసవించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని పెద్దగెరిగెపల్లెకు చెందిన గంగోత్రికి శనివారం ఉదయం పురుటినొప్పులు వచ్చాయి. కుటుంబసభ్యులు ఫోన్ చేయడంతో సకాలంలో చేరుకున్న 108 సిబ్బంది గంగోత్రిని కుప్పం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో రాజుపేట రోడ్డు సమీపంలో నొప్పులు తీవ్రమయ్యాయి. పండంటి ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చింది. తల్లీ శిశువును రామకుప్పం పీహెచ్‌సీకి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు. సకాలంలో స్పందించి ప్రసవం చేసిన 108 ఏఎంటీ లక్ష్మానాయక్, పైలట్ సురేష్‌కు గంగోత్రి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'నమస్తే'లో రిజిస్ట్రేషన్లు చేసుకోండి

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నమస్తే(నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం)లో మున్సిపాలిటీ పరిధిలో మల, మరుగు సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసే కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికుల జీవన భద్రత, ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. వీరికి మెడికల్ సౌకర్యంతోపాటు వారి పిల్లలకు మెరుగైన విద్యనందించే ఈ పథకంలో పేర్లను నమోదు చేసుకుని ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి ఈనెల 12న తమ కార్యాలయంలో వివరాలను ఇవ్వాలని తెలిపారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని గాంధీపురం వద్ద నీలగిరిచెట్ల తోట అగ్నికి ఆహుతైంది. శనివారం ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపిన వివరాలు.. రేణుకారాధ్యకు చెందిన నీలగిరి తోటలో కరెంటు వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఈ తీగలు గాలికి తగులుకుని రేగిన నిప్పు రవ్వల కారణంగా మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.15 వేల విలువ చేసే చెట్లు కాలిపోయినట్లు ఫైర్ ఆఫీసర్ చెప్పారు. వేసవి కాలం ప్రారంభమవుతుండడంతో ప్రజలు పొలాలు, తోటలు, ఇళ్ల వద్ద కరెంటు విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మంచినీటిని పొదుపుగా వాడుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి



వైఎస్సార్ జలాశయాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: రాబోవు వేసవి దృష్ట్యా ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణానికి మంచినీటి సరఫరా అవుతున్న కాలువపల్లె సమీపంలోని కౌండిన్యనదిపై నిర్మించిన వైఎస్సార్ జలాశయాన్ని శనివారం ఆయన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలసి పరిశీలించారు. అక్కడున్న నీటి నిల్వ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆపై పట్టణంలోని ఎద్దుల సంతవీధిలోని వాటర్ ప్యూరిఫయర్ యూనిట్‌ను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి అధికారులతో చర్చించారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ప్రజలు కూడా సహకరించి నీటిని వృధా చేయరాదని కోరారు.

మండలాభివృద్ధే లక్ష్యం: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ రోజా

సమావేశానికి అధికారులు గైర్హాజరు

పలమనేరు: అన్ని శాఖల సమన్వయంతో మండలాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎంపీపీ రోజా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల పరంగా మండలంలో పురోగతిని, అభివృద్ధి, సేవలను వివరించారు. అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడారు. జిల్లాలోనే చిన్న మండలమైన పలమనేరులో ఈ నాలుగేళ్లలో అభివృద్ధి బాగా చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందడంతో ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. ప్రధానంగా రాబోవు వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విద్యాసాగర్‌కు సూచించారు. మండల సమావేశానికి పలుశాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీనిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల అభివృద్ధి కీలకమైన సమావేశానికి అధికారులు గైర్హాజరవడం సరికాదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి హాజరు కాని వారిపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



ఉత్తమ పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పలమనేరు: గత నెల గణ తంత్ర దినోత్సవం సందర్భంగా మండలం నుంచి ఉత్తమ కార్యదర్శులుగా ఎంపికైన మండిపేట కోటూరు, సముద్రపల్లి బాలరాజు, మురళీనాథ్‌లను మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విద్యాసాగర్, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సర్పంచులు విశ్వనాథరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తిరుమలేష్, మునస్వామి, ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ డీఎం, కార్మికులు

పలమనేరు: స్థానిక ఆర్టీసీ అధికారులు రోడ్డు భద్రతపై శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డీఎం టీకే స్వామి మాట్లాడుతూ, రహదారి భద్రత జీవితానికి రక్ష అనే నినాదంతో రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 14వ తేదీ వరకు డిపో పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలు, వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ దినేష్, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



బైరెడ్డిపల్లి: గంగజాతర పురస్కరించుకుని స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 32 టీములు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వాలీబాల్ క్రీడలను పూర్వవిద్యార్థులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, ఇబ్రాహీం, విశ్వమోహన్, ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, శ్రీధర్, జంషీర్, జగదీష్, సుబ్రమణ్యం, అశోక్ కుమార్ ప్రారంభించారు.

రక్తదానం మిన్న



రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పలమనేరు: అన్నిదానాల కంటే ఆపదలో ఉన్న వారిని కాపాడే రక్తదానం చాలాగొప్పదని వైఎస్సార్ సీపీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు క్రిష్ణమూర్తి రెడ్డి అన్నారు. స్థానిక శ్రీవాణి, మధు విద్యాసంస్థల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. 30మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు పట్టణానికి చెందిన సేవకులు శివ, సీతారామయ్య తదితరులు ఆపిల్‌పండ్లు, జ్యూస్, బ్రెడ్‌ను అందజేశారు.